# ప్రజాపక్షం

## జిల్లా అనుబంధం

నల్లగొండ సూర్యాపేట యాదాద్రి

శుక్రవారం | 26 జూన్ , 2026 | పేజీలు : 5


## మాదక ద్రవ్యాలకు దూరంగా యువత



వివరాలు మెయిన్‌లో

## ఇందిరమ్మ ఇండ్లతో సొంతింటి కల సాకారం



**ప్రజాపక్షం/సూర్యాపేట రూరల్ :** ఇందిరమ్మ ఇండ్లతో అర్హులైన నిరుపేదల సొంతింటి కల సాకారం అవుతుందని సూర్యాపేట వ్యవసాయ మార్కెట్ కమిటి చైర్మన్ కొప్పుల వేణారెడ్డి అన్నారు. గురువారం మండలంలోని రాయినిగూడెంలో షేక్ షబానా సొందులకు ఇందిరమ్మ ఇంటి గృహ ప్రవేశానికి ఆయన హాజరై మాట్లాడారు. నిరుపేదల సంక్షేమమే ధ్యేయంగా నియోజక వర్గంలో మొదటి విడుతలో 3500 ఇండ్లు మంజూరు చేయించి 70 శాతం పూర్తి అయ్యాయన్నారు. రెండో విడతలో మరో 2000 ఇండ్లను కేటాయించడం జరుగుతుందన్నారు. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్ని వర్గాల ప్రజల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నారని అన్నారు. అధికారం చేపట్టిన 24 గంటల్లోనే మహిళలకు ఉచిత బస్సులు అమలు చేయడంతోపాటు సన్నవడ్లు పండించిన రైతులకు కింటాకు రూ.500 బోనస్ అందజేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. మహిళలను కోటీశ్వరులను చేసే ముఖ్యమంత్రి ఆలోచనలో భాగంగా మహిళలకు బస్సులను కొనుగోలు చేయించి వారిని యజమానులుగా చేయడం జరిగిందని గుర్తు చేశారు. అన్ని వర్గాల ప్రజల ఆకాంక్షలను నెరవేరుస్తూ నిరుపేదలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రజలంతా ఆదరించి అండగా నిలువాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కౌన్సిలర్ ఎల్గూరి ఇందిరా వీరయ్య గౌడ్, జిల్లా కాంగ్రెస్ అధికార ప్రతినిధి కుందమల్ల శేఖర్, మాజీ ఉమ్మడి నల్లగొండ జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు ఆయూబ్‌ఖాన్, మార్కెట్ డైరెక్టర్ షేక్ అబ్దుల్ కరీం, నాయకులు పందిరి మల్లేష్, రాపర్తి నాగరాజు, వెన్న ఉపేందర్, నంద్యాల బిక్షం రెడ్డి, నంద్యాల శ్రీనివాస్ రెడ్డి, గుర్రం వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

## పారదర్శకంగా'సర్' ప్రక్రియ



### తప్పులు లేకుండా ఓటరు నమోదు చేపట్టండి : కలెక్టర్ చంద్రశేఖర్

**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** సర్ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియను పారదర్శకంగా, ఎలాంటి తప్పులు లేకుండా నిర్వహించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ అన్నారు.గురువారం ఆయన మండలంలోని ఎల్లారెడ్డిగూడెం గ్రామంలో జరుగుతున్న సర్ ఓటరు నమోదు, మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా రేగటి సత్తయ్య కుటుంబాన్ని వారి నివాసంలో కలిసి, ఇంట్లో ఎంతమంది ఓటర్లు ఉన్నారు, వారి వివరాలు సక్రమంగా నమోదు చేస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు.ప్రతి కుటుంబానికి రెండు ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఒక ఫారాన్ని పూర్తిగా నింపి బూత్ లెవల్ అధికారి (బీఎల్ఓ)కు తప్పనిసరిగా అందజేయాలని సూచించారు. కుటుంబ సభ్యుల పూర్తి వివరాలను కచ్చితంగా నమోదు చేయాలని తెలిపారు.బీఎల్ఓలకు కలెక్టర్ సూచనలు చేస్తూ, ఎలాంటి పొరపాట్లు లేకుండా పూర్తి వివరాలను నమోదు చేయాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు వేర్వేరు పోలింగ్ స్టేషన్లలో నమోదు కాకుండా ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆదేశించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ఉన్నారు.

## కల్వర్టును ఢీకొట్టి ... అదుపుతప్పిన ఆర్‌టిసి బస్సు

### తప్పిన పెను ప్రమాదం బస్సులో ప్రయాణికులు క్షేమం





**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** ఎదురుగా వస్తున్న బైక్‌ను తప్పించబోయినఆర్‌టిసి బస్సు అదుపుతప్పి కల్వర్టును ఢీకొట్టడంతో పెను ప్రమాదం తృటిలో తప్పింది. ఈ ఘటన నల్లగొండ మండలం మోటుబాయిగూడెంగొల్లగూడెం గ్రామాల మధ్య గురువారం సాయంత్రం చోటుచేసుకుంది.వివరాల్లోకి వెళ్తే, చౌటుప్పల్ నుంచి నల్లగొండకు వస్తున్న ఆర్‌టిసి బస్సు మోటుబాయిగూడెం దాటిన తర్వాత ఉన్న మూలమలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా ఓ బైక్ వేగంగా వచ్చింది. బైక్‌ను తప్పించేందుకు డ్రైవర్ ప్రయత్నించగా బస్సు అదుపుతప్పి రహదారి పక్కన ఉన్న కల్వర్టును బలంగా ఢీకొట్టింది. దీంతో బస్సు ఒక్కసారిగా ఆగిపోయింది.కల్వర్టు అవతల కాలువ ఉండటంతో బస్సు మరింత ముందుకు వెళ్లి ఉంటే భారీ ప్రమాదం జరిగే అవకాశం ఉండేదని స్థానికులు తెలిపారు. బస్సులో సుమారు 120 మంది ప్రయాణికులు ఉండగా, వారంతా క్షేమంగా బయటపడటంతో ఊపిరి పీల్చుకున్నారు.ప్రయాణికుల కథనం ప్రకారం, ఇద్దరు యువకులు మద్యం మత్తులో బైక్‌ను అతివేగంగా నడుపుతూ బస్సుకు ఎదురుగా వచ్చారని, బస్సు అదుపుతప్పిన వెంటనే వారు అక్కడి నుంచి బైక్‌పై పరారైనట్లు తెలిపారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## పిహెచ్‌సిలో హెల్త్ స్క్రీనింగ్ ప్రారంభించిన విప్



**ప్రజాపక్షం/నార్కట్‌పల్లి :** స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో స్వయం సహాయక సంఘం సభ్యులకు హెల్త్ స్క్రీనింగ్ టెస్ట్ కార్యక్రమాన్ని ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రభుత్వం విద్య,వైద్యం, రైతాంగంపై ప్రత్యేక దృష్టితో పలు సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టింది. ప్రభుత్వం కల్పించిన ఈ ఆరోగ్య పరీక్షల అవకాశాన్ని మహిళా సంఘ సభ్యులందరూ వినియోగించుకొని తప్పనిసరిగా పరీక్షలు చేయించుకోవాలి. ముందస్తుగా గుర్తిస్తే చాలా వ్యాధులను నివారించవచ్చు అని సూచించారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ డిఆర్‌డిఒ శ్రవణ్ కుమార్,డిప్యూటీ డిఎంహెచ్‌ఒ నగేష్,స్థానిక పిహెచ్‌సి డాక్టర్ వనీతరావు,డిపిఎం ఐబి రామలింగయ్య, డిపిఎం మోహన్ రెడ్డి,ఎపిఎం జీడికల్లు, నర్సింహా,పాశం శ్రీనివాస్ రెడ్డి,సర్పంచ్ జెర్రిపోతుల భరత్,అయితరాజు యాదయ్య, ఉప సర్పంచ్ చామ శిరీష,శేఖర్,మేడి మణెమ్మ పాల్గొన్నారు.

## ముమ్మరంగా సమగ్ర ఓటరు జాబితా రూపకల్పన

**ప్రజాపక్షం/డిండి;** భారత ఎన్నికల సంఘం (ఇసిఐ) ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం గురువారం ప్రారంభమైంది. తొలిరోజు ఓటర్ల దగ్గరకు బిఎల్ఓలు వెళ్ళి ఎన్యూమరేషన్ ఫామ్స్ అందజేసే కార్యక్రమం డిండి మండలంలో ముమ్మరంగా సాగింది. గ్రామాల్లో పోలింగ్ స్టేషన్ పరిధిలో బిఎల్ఓలు ఎన్యూమరేషన్ ఫామ్స్ ఇంటింటికి తిరిగి ఇవ్వడం, యాప్‌లో ఆన్లైన్ చేసే విధానాన్ని మండల తహశీల్దార్ హనుమంత్ శ్రీనివాస్‌గౌడ్ పర్యవేక్షించారు. బిఎల్‌వోలను ఎప్పటికప్పుడు సూపర్‌వైజర్లు మానిటరింగ్ చేస్తూ పకడ్బందీగాఎస్ఐఆర్‌నిర్వహించే విధంగా చర్యలు చేపట్టా రు.

## పంచాయతీ మండల అధికారి వెంకటేశ్వర రెడ్డి బాధ్యతలు ఖరారు

**ప్రజాపక్షం/మునుగోడు** :మండల పంచాయతీ అధికారి గా వెంకటేశ్వర రెడ్డి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు.ఇప్పటివరకు రంగారెడ్డి జిల్లాలో పనిచేషి మునుగోడుకు బదిలీ అయి వచ్చారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన వెంకటేశ్వర్ రెడ్డికి మండల పంచాయతీ అధికారులు శుభాకాంక్షలు తెలియజేశారు.

## చెరువు పూడికతీత పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/నడిగూడెం:** రైతులు తమ పొలాలకు చెరువు మట్టి ని తొలుకోవాలని సర్పంచ్ గోసుల రాజేష్ అన్నారు. గురువారం మండల పరిధిలోని చెన్నకేశవ పురం గ్రామంలో ఉపాధి హామీ పథకంలో భాగంగా చెరువు పూడికతీత పనులకు శంకుస్థాపన చేసి కొబ్బరి కాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కటికల పుల్లయ్య, టెక్నికల్ అసిస్టెంట్ బాల్నె అంజిరెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ అంబేద్కర్, ఉపాధిహామీ మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

## నర్సింహాపురంలో ఓటర్ నమోదు ప్రక్రియ ప్రారంభం

**ప్రజాపక్షం/మునగాల:** ప్రభుత్వ ఎన్నికల సంఘం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న సర్ ఓటర్ నమోదు కార్యక్రమంను ఎన్యుమరేషన్ ఫామ్‌ను సర్పంచ్ వేమూరి సత్యనారాయణ ఓటర్‌కు గురువారం అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి అర్హులైన ఓటర్ సర్‌లో ఓటర్‌గా నమోదు చేయించుకోవాలని అలాగే ప్రతి ఇంటికి బిఎల్‌వోలు వచ్చి ఎమ్యునరేషన్ ఫామ్‌లు అందిస్తారని, తదుపరి ఓటర్ ఫామ్‌ను నింపి తిరిగి అధికారులకు అందించాలని కోరారు. అనంతరం ఓటర్ జాబితాలో తమ పేరు ఉంటుందని కావున ప్రతి ఒక్కరు అధికారులకు సహకరించి అవసరమైన పత్రాలను అందించి సర్ ప్రక్రీయలో సకాలంలో నమోదు అయ్యేలా తమవంతు బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వోలు ఉమ, పంచాయతీ కార్యదర్శి గంద్ర బాలరాజు, వార్డు సభ్యులు అజీజ్‌మియా పాల్గొన్నారు.

## యువత లక్ష్య సాధన దిశగా అడుగులు వేయాలి

**ప్రజాపక్షం/కోదాడ:** అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం జూన్ 26ను పురష్కరించుకుని చేపట్టిన రాష్ట్ర వ్యాప్త జనచైతన్య యాత్ర గురువారం కోదాడకు చేరుకుంది. ఈ సందర్భంగా జిల్లా కేంద్రానికి ప్రభుత్వ ఉపాధ్యాయుడు రాచకొండ ప్రభాకర్ యువతను డ్రగ్స్, గంజాయి సేవించడం వల్ల కలిగే నష్టాలపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాదకద్రవ్యాల అలవాటు వల్ల శారీరక, మానసిక అరోగ్యాలు దెబ్బతినడమే కాకుండా సామాజికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలు వాటిల్లుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రామాంజనేయులు, రాములు, పోలీస్ కానిస్టేబుల్ బాబా, స్థానిక యువకులు పాల్గొన్నారు.

## ప్రైవేట్, కార్పొరేట్ ఫీజుల దోపిడిని అరికట్టాలి

**ప్రజాపక్షం/దేవరకొండ;** భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) దేవరకొండ డివిజన్ కమిటి ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించడం జరిగింది. ఈసమావేశానికి ముఖ్య అతిథిగా ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ఆకారపు నరేష్ హజరై మాట్లాడుతూ ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు వసూలు చేస్తున్నప్పటికి, విద్యాశాఖ అధికారులు పట్టించుకోకుండా తీవ్ర నిర్లక్ష్యం చేస్తున్నారని మండిపడ్డారు. ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలలో బుక్స్, యూనిఫాంల పేరుతో వేలకు వేలు దండుకుంటున్నారని అన్నారు. అధిక ఫీజులు వసూలు చేస్తున్న పాఠశాలలపై విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేక ఇష్టారాజ్యంగా పాఠశాలల యాజమాన్యం వ్యవహిస్తుందని పాఠ్యపుస్తకాలు, ఫీజులు కట్టని విద్యార్థులను తరగతులకు అనుమతించకుండా వారిని మానసిక క్షభకు గురిచేస్తున్నారని వాపోయారు. విద్య అనేది ప్రతి ఒక్క విద్యార్థి హక్కు కానీ నేడు కార్పొరేట్ విద్యాసంస్థలు అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను సామాన్య ప్రజలకు అందని ద్రాక్షగా మారుస్తున్నాయని ఫీజులు పేరుతో తల్లిదండ్రులను ఆర్థికంగా ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రభుత్వం, విద్యాశాఖ అధికారులు వెంటనే జోక్యం చేసుకుని ప్రైవేట్ విద్యా సంస్థల ఫీజులను నియంత్రించడంతో పాటు విద్యార్థులపై ఒత్తిడిని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకువచ్చి, విద్యను వ్యాపారంగా మార్చే ధోరణిని అరికట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈకార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి వెంకటేష్, మల్లేష్, త్రిశాంత్, అశోక్, అరవింద్, అఖిల్, గణేష్, జైరాం, మనోహర్, శ్రవణ్, శోభన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి



**ప్రజాపక్షం/మునుగోడు :** మండలం వ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా నడిపిస్తున్న ప్రైవేటు పాఠశాల పై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి.ముదిగొండ మురళీకృష్ణ అన్నారు.గురువారం ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మండల విద్యాశాఖ అధికారికి వినతి పత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా కార్యదర్శి ముదిగొండ మురళీకృష్ణ మాట్లాడుతూ. మండలంలో ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలు తుంగలో తొక్కుతూ ఇష్టాను సారంగా వవరిస్తున్నారని మండిపడ్డారు.ఫీజుల నియంత్రణ చట్టం అమలు చేయాలని, విచ్చలు విడిగా ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని, పాఠశాల ఆవరణలో పాఠ్యపుస్తకాలు, యూనిఫామ్,డైరీలు అమ్ముతూ ప్రైవేట్ పాఠశాల వ్యాపారం చేస్తున్నాయని ఆరోపించారు. అర్హత లేని టీచర్లచే విద్యా బోధన చేస్తున్నారని అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే, ప్రైవేటు పాఠశాలలపై ప్రత్యక్షంగా దాడులు నిర్వహిస్తామని హెచ్చరించారు.వినతి పత్రం అందజేసిన వారిలో జిల్లా ఉపాధ్యక్షలు గోపగోని ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## చట్టాన్ని ఉల్లంఘిస్తే ఉపేక్షించం

### కోదాడ రూరల్ ఇన్‌చార్జి సిఐ రామకృష్ణారెడ్డి

**ప్రజాపక్షం/అనంతగిరి:** మండల పరిధిలోని అమీనాబాద్ గ్రామానికి చెందిన ఇరువురి మధ్యలో ప్రహరిగొడ కూల్చిన విషయంలో పోలీస్‌శాఖ చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరిగిందని కోదాడ రూరల్ సర్కిల్ ఇన్‌ఛార్జి సిఐ రామకృష్ణారెడ్డి గురువారం విలేకరులతో మాట్లాడారు. ఈ విషయంలో గొడ కూల్చిన వ్యక్తిని చట్టప్రకారం బైండోవర్ చేశామని, మళ్లీ చట్టాన్ని ఉల్లంఘించి నేరం చేయవద్దు అనే ఉద్దేశ్యంతో బైండోవర్ చేశామని అన్నారు. ఈ వివాదంలో మొదటిసారి గొడ కూల్చినప విషయంలో ఫిర్యాదు వచ్చినది, ఇరువర్గాల పెద్ద మనుషుల సమక్షంలో పరిష్కారం చేసుకుంటామని అంగీకారానికి వచ్చారు. ఏదైనా ఉంటే సర్వేల ద్వారా, సంబంధిత అధికారుల ద్వారా సమస్యను పరిష్కరించుకోవాలని చట్టాన్ని ఉల్లంఘించవద్దని ఇరు వర్గాలకు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారని అన్నారు. అంగీకారాన్ని ఉల్లంఘించి చట్టాన్ని ఉల్లంఘిస్తూ రెండవ సారి కూడా గోడ కూల్చారని ఈనెల 16వ తేదీన డయల్ 100 ద్వారా బాధితులు ఫిర్యాదు చేయగా పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని బాధితులకు పోలీస్ సేవలు అందించారని అన్నారు. డయల్ 100కు ఏ సమయంలో ఫిర్యాదు వచ్చిన అర్ధరాత్రి అపరాత్ర అనిచూడకుండా పోలీస్ శాఖ ప్రజలకు బాధితులకు పోలీస్ సేవలు అందిస్తుందన్నారు. ఈ వివాదానికి సంబంధించి ఒక పత్రికలో పోలీస్ చర్యలపై తప్పుడు కథనాలు ప్రచురితమయ్యాయని ఇలాంటి విషయాలలో పోలీసులను సంప్రదించి విషయాలను నివృత్తి చేసుకోవాలని కోరారు. పోలీస్ శాఖ ఎల్లప్పుడు శాంతిభద్రతల పరిరక్షణలో కృషి చేస్తూ విష్పక్షపాతంగా ప్రజల ధన మూల ప్రాణ రక్షణకు పనిచేస్తుందని సిఐ రామకృష్ణారెడ్డి తెలిపారు.

## స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పొరేషన్

### స్వర్ణకార సంఘం డిమాండ్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్ :** స్వర్ణకారుల సంక్షేమానికి ప్రత్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేయాల ని స్వర్ణకార సంఘం జిల్లా అధ్యక్షుడు తొగట్టి మురళీ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని పూల సెంటర్ సమీపంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర సాధనలో విశ్వబ్రాహ్మణ స్వర్ణకారుల పాత్ర ఎంతో గణనీయమైనదన్నారు. స్వర్ణకారులు తరతరాలుగా సాంప్రదాయ వృత్తిని కొనసాగిస్తూ సమాజానికి సేవలందిస్తున్నప్పటికి, నేడు వారి పరిస్థితి రోజురోజుకు దిగజారిపోతుందని ఆవేదన వ్యక్తం చేశారు. భారీ పెట్టుబడులతో కార్పోరేట్ సంస్థలు జ్యువెలరీ షాపులను ఏర్పాటు చేసి ఆర్భాటమైన, మోసపూరిత ప్రకటనలతో వినియోగదారులను ఆకర్షిస్తున్నాయని, దీంతో సాంప్రదాయ స్వర్ణకారుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం ప డుతోందన్నారు. స్వర్ణకారుల అభ్యున్నతి కోసం ప్ర త్యేక కార్పోరేషన్ ఏర్పాటు చేసి పాలకమండలిని ని యమించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే జిఓ 2 72ను సవరణ చేసి పటిష్టంగా అమలు చేయడం ద్వా రా దొంగ బంగారం రికవరీ కేసుల పేరుతో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న ఇబ్బందుల నుంచి రక్షణ క ల్పించాలని డిమాండ్ చేశారు. 50 సంవత్సరాలు దా టిన స్వర్ణకారులకు నెలకు రూ.5వేల సామాజిక పె న్షన్ మంజూరు చేయాలని కోరారు. అనంతరం త మ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లోని జిల్లా రెవెన్యూ అధికారి డి. ప్రేమ్ రాజుకు అందజేశారు. ఈ సమావేశంలో నాయకులు పాల్గొన్నారు.

## పెవేటు పాఠశాలలు నిబంధనలు పాటించాలి

**ప్రజాపక్షం/కొండమల్లేపల్లి;** ప్రైవేటు పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలు పాటించి పాఠశాలలను నడుపుకోవాలని కొండమల్లేపల్లి మండల విద్యాశాఖ అధికారి రమావత్ నాగేశ్వర్‌రావు గురువారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాలలు ఒకటవ తరగతి నుండి పదవ తరగతి వరకు ఫీజుల పట్టికను పాఠశాలలో ఒక పట్టికపై ఏర్పాటు చేయాలని సూచించారు. పాఠశాలలో బుక్స్, టై, బెల్ట్‌లు, డైరీలు, యూనిఫారాలు అమ్మకూడదని అన్నారు. ఒకవేళ అమ్మిన మార్కెట్ రేట్ల ప్రకారం అమ్మాలని అన్నారు. అధిక రేట్లకు అమ్మినట్లయితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విద్యా సంవత్సరం ప్రారంభం అయినందు వలన విద్యార్థులు ఒక పాఠశాల నుండి మరోక పాఠశాలకు వెళ్ళిన అలాంటి విద్యార్థులను ఫీజు బకాయిల కోసం టీసిలు ఇవ్వకుండా ఇబ్బంది పెట్టినట్లయితే చర్యలు తీసుకుంటామని అన్నారు. పాఠశాలలకు బస్సులు నడుపుతున్న యాజమాన్యాలు తప్పనిసరిగా తమ వాహనాలకు సంబందించిన ఫిట్‌నెస్ సర్టిఫికేట్లు, డ్రైవర్ లైసెన్‌లను సోమవారం రోజు ఎంఆర్‌సి కార్యాలయంలో ఇవ్వాలని అన్నారు. నిబంధనలు పాటించని ప్రైవేట్ పాఠశాలలపై ప్రభుత్వ నిబంధనల ప్రకారం కచ్చితంగా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నిజాయితీగా పనిచేసి పోలీస్ గౌరవాన్ని పెంచాలి



**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్ :** బాధ్యతాయుతంగా,నిజాయితీతో, సేవా భావంతో పనిచేసి పోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా తమ పనితీరుతో ఆదర్శంగా నిలవాలని జిల్లా ఎస్పి శరత్ చంద్ర పవార్ ఆకాంక్షించారు. జిల్లా పోలీసు శాఖలో విధులు నిర్వహిస్తున్న 10 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు హెడ్ కానిస్టేబుళ్లుగా పదోన్నతి పొందారు. గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్పీ పదోన్నతి పొందిన సిబ్బందికి హెడ్ కానిస్టేబుల్ పట్టీలు అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ, పదోన్నతి అనేది కేవలం హోదా పెరుగుదల మాత్రమే కాకుండా బాధ్యతలు కూడా మరింత పెరిగినట్లేనని అన్నారు. ఇప్పటి వరకు చూపిన క్రమశిక్షణ, అంకితభావం, సేవా తత్పరతను ఇదే విధంగా కొనసాగిస్తూ కొత్త హోదాలో మరింత సమర్థవంతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.పోలీసు శాఖలో ప్రతి ఒక్కరి కృషి ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణలో ఎంతో ముఖ్యమని ఎస్పి పేర్కొన్నారు. ప్రజలకు మరింత చేరువగా ఉంటూ, బాధ్యతాయుతంగా, నిజాయితీతో, సేవా భావంతో పని చేయాలని పదోన్నతి పొందిన సిబ్బందికి సూచించారు. శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా తమ పనితీరుతో ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో ఏ.ఆర్ డీఎస్పీ శ్రీనివాసులు , ఆర్.ఐ సంతోష్ , పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## మాదక ద్రవ్యాల నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలి : ఎస్‌పి

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** యువత తమ లక్ష్యాలపై దృష్టి పెట్టి మాదక ద్రవ్యాలకు దూరంగా ఉండాలని జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ సూచించారు.అంతర్జాతీయ మాదక ద్రవ్యాల దుర్వినియోగం అక్రమ రవాణా వ్యతిరేక దినోత్సవం సందర్భంగా, నషా ముక్త్ అభియాన్ లో భాగంగా గురువారం నల్లగొండ పరిధిలోని మహాత్మా గాంధీ యూనివర్సిటీలో మాదక ద్రవ్యాల నిర్మూలనపై ఏర్పాటుచేసిన ప్రత్యేక అవగాహన కార్యక్రమానికి జిల్లా ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులు, యువతను ఉద్దేశించి ప్రసంగించారు. మాదక ద్రవ్యాలు వ్యక్తిగత ఆరోగ్యానికే కాకుండా కుటుంబ వ్యవస్థకు, సమాజ శాంతి భద్రతలకు,యువత భవిష్యత్తుకూ తీవ్రమైన ముప్పు అని పేర్కొన్నారు. మత్తు పదార్థాలకు బానిసైతే భవిష్యత్తు చీకటిమయం అవుతుందని డ్రగ్స్‌కు దూరం కుటుంబానికి ఆనందం, సమాజానికి భద్రత అని పేర్కొన్నారు. యువత మాదక ద్రవ్యాల వ్యతిరేక పోరాటంలో ముందుండాలని, తమ స్నేహితులను కూడా ఈ దుష్ప్రవర్తన నుంచి దూరంగా ఉంచాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో యూనివర్సిటీ రిజిస్ట్రార్ అంజి రెడ్డి,ఎస్బి సీఐ ఆది రెడ్డి, నార్కట్‌పల్లి సీఐ సురేష్, ఎస్.ఐ విష్ణు, అధ్యాపకులు,విద్యార్థులు పాల్గొన్నారు.

## నూతన ఎంపిడిఓగా ఆండాలు

**ప్రజాపక్షం/చింతలపాలెం :** మండల నూతన ఎంపిడిఓగా ఐ. ఆండాలు గురువారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కనగల్ మండలం నల్లగొండ జిల్లాలో సూపరింటెండెంట్‌గా పనిచేసి మండల పరిషత్ అభివృద్ధి అధికారిగా పదోన్నతిపై వచ్చారు. ఎంపిఒభూపాల్‌రెడ్డి కార్యాలయ సిబ్బందితో స్వాగతం పలికి, శుభాకాంక్షలు తెలిపారు.


## 28 నుండి మూడు రోజుల పాటు పల్స్‌పోలియో కార్యక్రమం

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** ఐదేళ్లలోపు పిల్లలందరికి వంద శాతం పోలియో చుక్కలు వేసి, పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెన్‌పహాడ్ వైద్యాధికారి డాక్టర్ రాజేష్ తెలిపారు. ఈనెల 28 నుండి మూడు రోజుల పాటు జరగనున్న పల్స్‌పోలియో కార్యక్రమంపై గురువారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యసిబ్బంది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, వాలెంటీర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలియో రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ సమన్వయంతో పనిచేయాలన్నారు. 5 సంవత్సరాల లోపు పిల్లలను సమీపంలోని పోలియో బూత్‌లకు తీసుకువచ్చి తప్పనిసరిగా చుక్కలు వేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, ఆరోగ్య విస్తరణాధికారి తాడూరి వెంకన్న, హెల్త్ సూపర్‌వైజర్ పూలమ్మ, ఎంఎల్‌హెచ్‌పిలు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలి

**ప్రజాపక్షం/కోదాడ రూరల్:** విత్తన మేళాను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ రెడ్డి అన్నారు. గురువారం మండలంలోని అల్వాలపురం, గుడిబండ రైతువేదికల్లో ఏర్పాటు చేసిన విత్తనమేళాల్లో ఆయన హాజరై మాట్లాడారు. రైతులు నాణ్యమైన, ప్రభుత్వం సూచించిన సన్న రకాలను కొనుగోలు చేయాలని సూచించారు. ఎల్నినో వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలు కందులు, పెసర్లు, కూరగాయల పంటలు సాగుచేయాలని కోరారు. అనంతరం ఆయన కోదాడ మండలంలోని ఎరువుల దుకాణాల ఎరువుల నిల్వలను పరిశీలించి యాప్ ద్వారానే యూరియా ఎరువు కొనుగోలు చేసుకోవాలన్నారు. డీలర్స్ ఎంఆర్‌పి రేట్లకు ఎరువులను అమ్మాలని, రైతులను ఇబ్బంది పెట్టిన యెడల కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయ సంచాలకులు పి. ప్రశాంతి, మండల వ్యవసాయ అధికారి పాలెం రజని, వ్యవసాయ విస్తరణ అధికారి నగేష్, పిచ్చయ్య, మహేష్, రైతులు, డీలర్స్ పాల్గొన్నారు.

## సర్ ప్రక్రియ ప్రారంభం



**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని కల్మల్ చెర్వులో సర్ ప్రక్రీయ ఓటర్ నమోదును గురువారం బిఎల్‌వో బచ్చలకూర కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణలో ప్రతి ఒక్క బూత్ స్థాయి అధికారి, నాయకులు, కార్యకర్త బాధ్యతగా పాల్గొని బాధ్యతగల ప్రతి ఒక్కరు ఓటరు పేరు సర్ ప్రక్రీయలో ఉండేలా చూసుకోవాలని, వారికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో బిఎల్‌వో అమరవరపు రమేష్, వార్డు నెంబర్లు నరేష్, విమలమ్మ, లక్ష్మయ్య పాల్గొన్నారు.

## నక్షా ప్రాజెక్ట్ రికార్డుల నమోదు పారదర్శకంగా పూర్తి

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** పట్టణ ప్రణాళికా విభాగం, వార్డు అధికారుల ఆధ్వర్యంలో ప్రతిష్టాత్మకంగా సాగుతున్న 'నక్షా ప్రాజెక్ట్' క్షేత్రస్థాయి పరిశీలనను మున్సిపల్ కమీషనర్ గురువారం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా క్షేత్రస్థాయిలో వార్డు అధికారులు ఆస్తుల హక్కుల రికార్డు నమోదు ప్రక్రియను నిర్వహిస్తున్న తీరును కమిషనర్ నిశితంగా పరిశీలించి, అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నక్షా ప్రాజెక్ట్ అనేది ప్రజల భూములు, ఆస్తుల రక్షణకు సంబంధించిన అత్యంత కీలకమైన కార్యక్రమమని, క్షేత్రస్థాయిలో ఎలాంటి పొరపాట్లకు తావులేకుండా పారదర్శకంగా ఈ రికార్డుల నమోదు పూర్తి కావాలని ఆదేశించారు. నక్షా కార్యక్రమంపై ప్రజల్లో ఉన్న అపోహలను తొలగించడమే మొదటి ప్రాధాన్యత కావాలన్నారు. వార్డు అధికారులు ప్రజల వద్దకు వెళ్లేటప్పుడు నమ్రతతో, ఓపికతో వ్యవహరించాలని, ఈ ప్రాజెక్ట్ వల్ల ప్రజలకు చేకూరే ప్రయోజనాలను వారికి విడమర్చి చెప్పాలని సూచించారు. ఈ ప్రతిష్టాత్మక కార్యక్రమం వంద శాతం విజయవంతం కావాలంటే స్థానిక వార్డు కౌన్సిలర్ల సహకారం ఎంతో అవసరమన్నారు. కౌన్సిలర్లు తమ వార్డుల్లోని ప్రజలకు దీనిపై అవగాహన కల్పించాలని కోరారు. నక్షా రికార్డుల నమోదు సమయంలో వార్డు అధికారులు ఎదుర్కొంటున్న సాంకేతిక, ఆచరణాత్మక ఇబ్బందులను కమిషనర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ప్రతిరోజూ ఇళ్ల వద్దకు వచ్చే స్వచ్ఛ ఆటోల ద్వారా నక్షా కార్యక్రమం యొక్క ప్రాముఖ్యతను ఆడియో రూపంలో వినిపిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నట్లు తెలిపారు. వార్డు అధికారులు, కౌన్సిలర్లు స్థానికంగా ప్రజలతో నేరుగా మాట్లాడి అవగాహన కల్పించడం వల్ల పరస్పర నమ్మకం పెరుగుతుందని, దీనివల్ల రికార్డుల నమోదు ప్రక్రియ మరింత సులభతరం అవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలోటిపిబిఒ, వార్డు అధికారులు పాల్గొన్నారు.


## ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ

**ప్రజాపక్షం/నల్లగొండ :**ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా ఇంటింటికి వచ్చే బిఎల్ఓ,బిఎల్ఓ సూపర్‌వైజర్లకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి బి. చంద్రశేఖర్ కోరారు.గురువారం నుండి ప్రారంభమైన ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఆయన నల్లగొండ జిల్లా కేంద్రంలోని రహమత్ నగర్‌లో బిఎల్ఓలు నిర్వహిస్తున్న ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఇంటింటి సందర్శనలో ఇంటి యజమానులతో, బిఎల్ఓలతో మాట్లాడారు. ఎంతమంది కుటుంబ సభ్యులు ఉన్నారు, ఎంతమంది ఓటర్లు ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. బిఎల్ఓ యాప్ అప్‌డేట్ చేసుకున్నారా అనిబిఎల్ఓను ప్రశ్నించారు.అనంతరం మీడియాతో కలెక్టర్ మాట్లాడుతూ, కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 25 నుండి వచ్చే నెల 24 వరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ఎన్యూమరేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగా బిఎల్ఓలు, బిఎల్ఓ సూపర్‌వైజర్లు ఇంటింటికి వచ్చి ఓటరు ఎన్యూమరేషన్ ఫారాలను ఇస్తారని, వాటిలో పూర్తి వివరాలను నమోదు చేసి అవసరమైన ధ్రువపత్రాలను జతపరచి ఇవ్వాలని సూచించారు. తాత్కాలికంగా ఇతర ప్రాంతాల్లో నివాసం ఉంటున్న వారు నివాసం ఉండే చోట ఓటు నమోదు చేసుకోవచ్చని తెలిపారు. 2002 జాబితాలో పేరు ఉండి ప్రస్తుత జాబితాలో పేరు ఉన్నవారు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాల్సిన అవసరం లేదని, అయితే వారి పిల్లలు, గతంలో పేర్లు ఉండి ప్రస్తుత జాబితాలో లేని వారు మాత్రం ఎన్నికల సంఘం పేర్కొన్న 12 రకాల ధ్రువపత్రాల్లో ఏదో ఒకటి సమర్పించాలని చెప్పారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరూ ఎక్కడ నివాసం ఉంటే అక్కడ ఓటు నమోదు చేసుకోవచ్చని వివరించారు.కలెక్టర్ వెంట రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి, నల్లగొండ తహసీల్దార్ పరశురాం,కార్పొరేటర్ అమీనా ఫరీద్ తదితరులు ఉన్నారు.

## మాలలకు అన్యాయం చేస్తే సహించేది లేదు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** ఉద్యోగ నోటిఫికేషన్లలో రోస్టర్ పాయింట్లపై మాల మహానాడు జాతీయ అధ్యక్షులు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా, మాలలకు జరుగుతున్న అన్యాయాలపై తగిన గుణపాఠం చెప్పి మాలలను చైతన్యవంతం చేస్తామని మాల మహానాడు జాతీయ అధ్యక్షులు తాళ్లపల్లి రవి హెచ్చరించారు. గురువారం నల్గొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని మాల మహానాడు కార్యాలయంలో ఉమ్మడి నల్గొండ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మాల మహానాడు నల్గొండ జిల్లా అధ్యక్షులు బొప్పని నగేష్ అధ్యక్షత వహించగా, తాళ్లపల్లి రవి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రభుత్వాలు విడుదల చేస్తున్న ఉద్యోగ నోటిఫికేషన్లలో రోస్టర్ పాయింట్ల విధానం వల్ల మాలలకు ఒక్క ఉద్యోగం కూడా దక్కకుండా పోతోందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మాలలకు తీవ్ర అన్యాయం చేస్తున్నాయని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో షెడ్యూల్డ్ కులాల ఉమ్మడి నల్గొండ జిల్లా అధ్యక్షులు మాటూరి శ్రీనివాస్, మిర్యాలగూడ టౌన్ అధ్యక్షులు మర్రి రోజ్ కుమార్, మాల మహానాడు సోషల్ మీడియా రాష్ట్ర కన్వీనర్ పెరుమాళ్ల ధనమ్మ, రాష్ట్ర కమిటీ మెంబర్ సప్పిడి సావిత్రి, వనపట్ల శోభ, కోడిరెక్క ప్రవీణ్, రాష్ట్ర కమిటీ వాలంటీర్ చిలుకూరి అభినయ్, తోటకూరి ముండ్ల నాగరాజు, పల్లి వీరయ్య, సామా నగేష్, యాదగిరిపల్లి మండల అధ్యక్షులు జక్కా నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## 'సర్'తో ఓటు హక్కులను హరించే చర్యలను విరమించాలి




**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా చేపడుతున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) కార్యక్రమం పేరుతో కోట్లాది మంది పేదలు, వలస కార్మికులు, గిరిజనులు, దళితులు, మైనార్టీలు, అట్టడుగు వర్గాల ఓటు హక్కులను హరించే చర్యలను విరమించాలని సిపిఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జున్ రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని మల్లు వెంకట నరసింహా రెడ్డి భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల జాబితాల్లో పేర్ల సవరణ, కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా ఇతర ప్రాంతాలకు మారిన వారి పేర్లు తొలగింపు వంటి ప్రక్రియలు పారదర్శకంగా జరగాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుతం అమలు చేస్తున్న సర్ విధానం అనేక సందేహాలకు తావిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలోని పలు రాష్ట్రాల్లో ప్రతిపక్ష పార్టీలు, ప్రజాస్వామ్య శక్తులు ఈ ప్రక్రియలో ఓట్లు గల్లంతైనట్లు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత ప్రాథమిక రాజ్యాంగ హక్కు అని దానిని హరించే విధంగా ఎలాంటి చర్యలు చేపట్టరాదన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రకమిటి సభ్యులు కొలిశెట్టి యాదగిరి రావు, జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మట్టిపెల్లి సైదులు, కోట గోపి, చెరుకు ఏకలక్ష్మి పాల్గొన్నారు.

## ఘనంగా మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో గురువారం మహనీయుల విగ్రహాల ఆవిష్కరణ కార్యక్రమం గ్రామ సర్పంచ్ నాతాల వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది. జాతిపిత మహాత్మా గాంధీ, బాబు జగ్జీవన్‌రామ్, మహాత్మా జ్యోతిరావుపూలే, రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహాలను ఆయన ప్రారంభించి విగ్రహ దాతలను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ శ్రీరాములు, మాజీ సర్పంచ్ దొంతగాని గోపయ్య, నాయకులు బేగంజాన్మియా, కుందూరు వెంకట్‌రెడ్డి, సునంద రాంరెడ్డి, యాకూబ్ అలీ, మౌలానా ఉస్మాన్, వినీత, చెన్ను కృష్ణారెడ్డి, మాతంగి వెంకన్న పాల్గొన్నారు.

## 5న తెలంగాణ రాజ్యాధికార సమరభేరి బహిరంగ సభ

**ప్రజాపక్షం/పెన్‌పహాడ్:** జూలై 5న తెలంగాణ రాజ్యాధికార పార్టీ ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రాజ్యాధికార సమరభేరి భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు మామిడి అంజయ్య పిలుపునిచ్చారు. గురువారం మండలంలోని వివిధ గ్రామాలలో ప్రముఖులకు ఆహ్వాన పత్రికలను అందజేసి ఆయన మాట్లాడారు. అట్టడుగు వర్గాల రాజ్యాధికారమే ధ్యేయంగా జరుగు సభకు ప్రతి ఒక్కరూ తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు ఆవుల అంజయ్య, జిల్లా నాయకులు మామిడి శోభన్‌బాబు గౌడ్, రంగయ్య పాల్గొన్నారు.

## కిరాణాషాపులో చోరి

**ప్రజాపక్షం/మేళ్లచెరువు:** మండల కేంద్రంలోని మెయిన్‌రోడ్డులో గల గోళ్ల సంగయ్య కిరాణ దుకాణంలో చోరీ ఘటన చోటుచేసుకుంది. సమాచారం మేరకు దుకాణంలోకి ప్రవేశించిన గుర్తు తెలియని వ్యక్తి క్యాస్ కౌంటర్‌లో ఉన్న నగదును అపహరించి పరారయ్యాడు. దుకాణంలో యజమాని లేని సమయంలో ఈ ఘటన జరిగినట్లు స్థానికులు తెలిపారు. చోరికి సంబంధించిన దృశ్యాలు దుకాణంలోని సీసీ కెమెరాల్లో రికార్డు కావడంతో పోలీసులు వాటిని పరిశీలిస్తున్నారు. బాధితుడు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు సమాచారం. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## నూతన గ్రామ పంచాయతీ భవన నిర్మాణానికి శంకుస్థాపన

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి పాటుపడుతుందని సర్పంచ్ కందుల మంగమ్మ కోటిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని కొండాయిగూడెం గ్రామంలో నూతనంగా మంజూరైన గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులకు ఎంపిడివో తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపివో, అంజన్‌రెడ్డి, ఉప సర్పంచ్ శీరిష మోహన్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి నరేష్, వార్డు సభ్యులు, మాజీ సర్పంచ్ పరమేష్, కర్నే దామోదర్‌రెడ్డి పాల్గొన్నారు.

## వేదమంత్రాల మధ్య కొలువుదీరిన కనకదుర్గమ్మ

**ప్రజాపక్షం/గరిడేపల్లి:** మండల పరిధిలోని కీతవారిగూడెం గ్రామంలో ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న శ్రీ కనకదుర్గమ్మ శ్రీ అంకమ్మ శ్రీ మారమ్మ, మద్దిరావమ్మ, శ్రీ సింహవాహన ద్వారా శక్తుల కీర్తిధ్వజ, పోతురాజు స్థిర ప్రతిష్ట మహోత్సవమును గురువారం భక్తులు భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా వేదమంత్రోత్సవాల మధ్య ఘనంగా ప్రతిష్టించారు. కోరిన కోరికలు తీర్చే కొంగు బంగారమై పిలిస్తే పలికే ప్రత్యక్ష దైవంగా కనకదుర్గ అమ్మవారిని మహిళ భక్తులు పసుపు కుంకుమలతో దర్శించుకునేందుకు తెల్లవారుజాము నుండే బారులు తీరారు. వేదపండితులు బ్రహ్మశ్రీ రాయపోలు శ్రీరామయ్యశర్మ, బ్రహ్మశ్రీ భద్రయ్య శర్మ, రాళ్లబండి రాజశేఖర్ శర్మ బృందంతో శాస్త్రోకంగా ప్రత్యేకపూజలు హోమాలు నిర్వహించారు. గ్రామస్తుల సహయ సహకారాలతో నిర్మించిన ఈ దేవాలయాలకు కమిటి సభ్యులు అమ్మవారి మాలలు ధరించి మూడు రోజులుగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. బిఆర్ఎస్ నాయకులు పిల్లుట్ల రఘు, సర్పంచ్ బొల్లేపల్లి రామనాదం, పిఎసిఎస్ చైర్మన్ ,మాజీ సర్పంచులు, ఎంపిటిసిలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

## 100కెవి ట్రాన్స్‌ఫార్మర్‌ను ప్రారంభించిన సర్పంచ్ రమేష్

**ప్రజాపక్షం/గుండాల;** యాదాద్రి భువనగిరి జిల్లా గుండాల మండలం బుర్జుబావి గ్రామంలో ప్రభుత్వ విప్, ఆలేరు ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్య సహకారంతో 100 కెవి ట్రాన్స్ ఫార్మర్‌ను గురువారం గ్రామ సర్పంచ్ వల్లాల రమేష్ ప్రారంభించారు. ఈసందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామంలో రైతులు లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడుతున్న విషయాన్ని ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్య దృష్టికి తీసుకువెళ్లడంతో తక్షణమే స్పందించిన ఎంఎల్‌ఎ రైతులు లో ఓల్టేజ్ సమస్యతో ఇబ్బందులు పడకుండా ఉండేందుకు గ్రామానికి 100 కెవి ట్రాన్స్ ఫార్మర్ ను మంజూరు చేయడం జరిగిందని తెలిపారు. సమస్యను ఎంఎల్‌ఎ దృష్టికి తీసుకువెళ్లగానే వెంటనే సమస్యను పరిష్కరించిన ఎంఎల్‌ఎ బీర్ల అయిలయ్యకు రైతుల తరుపున ఆయన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు ఇమ్మడి దశరథగుప్త, మాజీ ఎంపిపి వేణుగోపాల్‌యాదవ్, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు, నాయకులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## సర్‌పై ఇంటింటి సర్వేపై అఖిలపక్ష నాయకులతో తహసిల్దార్ సమావేశం

**ప్రజాపక్షం/మునగాల:** సర్ ఇంటింటి సర్వే ప్రక్రియపై గురువారం మండల కేంద్రంలో స్థానిక తహసిల్దార్ కార్యాలయంలో తహసిల్దార్ సరిత అధ్యక్షతన అఖిలపక్ష రాజకీయ పార్టీల మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ సరిత మాట్లాడుతూ సర్ ప్రక్రీయ జూన్ 25నుండి జూలై 24వ తేదీ వరకు నెలరోజుల పాటు రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల ఏరకు నిర్వహించడం జరుగుతుందని, దీనిలో బాగంగా గ్రామీణ ప్రాంతాలలో ఓటర్లకు ఈనెల రోజుల పాటు జరిగే సర్ ప్రక్రీయలో రాజకీయ పార్టీల నాయకులు, బూత్ లెవల్ ఏజెంట్లు తమ గ్రామంలోని ఓటర్లకు అవగాహన కల్పించి, ప్రతి ఒక్కరు సర్ సర్వేలో తమ పూర్తి వివరాలను నమోదు చేసుకుని తమ ఓటు హక్కును తామే నిర్వహించుకుని విజయవంతం కోసం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కొప్పుల జైపాల్‌రెడ్డి, కాసర్ల కోటేశ్వర్‌రావు, తొగరు రమేష్, బుర్రి శ్రీరాములు, సిహెచ్ సీతారాం, నాగేశ్వర రావు, కలకోవ సర్పంచ్ మండవ వెంకటాద్రి, కాసర్ల వెంకట్, ఉడుం కృష్ణ, శ్రీనివాసరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ స్వప్న, ఆర్‌ఐ లు రామారావు, మంజుల పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఎలక్ట్రీషన్ యూనియన్ బంద్ సంపూర్ణం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :** రాష్ట్ర ప్రైవేట్ ఎలక్ట్రీషన్ యూనియన్ పిలుపుమేరకు పోచంపల్లి మండల వ్యాప్తంగా నిర్వహించిన బంద్ సంపూర్ణమైనట్లు అధ్యక్షులు రాసూరి సత్యనారాయణ తెలిపారు. గురువారం స్థానిక బాలాజీ ఫంక్షన్ హాలుని సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా రాష్ట్ర అధ్యక్షులు జానయ్య, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి బారాల స్వామి హాజరయ్యారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వివిధ జిల్లాల అధ్యక్షులు మద్దతు ప్రకటించారు. పెరుగుతున్న ధరల దృష్ట్యా ఎలక్ట్రీషన్ వరకు సంబంధించి నిర్ణీత ధరల పట్టికను నిర్ణయించి దానికి అనుగుణంగా కార్మికులు కాంట్రాక్టులు కుదుర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తోట శ్రవణ్ కుమార్, నరసింహ, వెంకటేశ్వర్లు, మండల ఉపాధ్యక్షులు ప్రధాన కార్యదర్శి ఏర్వ విగ్నేష్, కోశాధికారి తంతరపల్లి వినోద్ గౌడ్, సహాయ కార్యదర్శి ఆనందాసు బాలకృష్ణ, రామకృష్ణ, బిక్షపతి, దత్తు, సురేష్, మహేష్, వనం నరసింహ, ఆశిఫ్ తదితర సభ్యులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఘనంగా డాక్టర్ రామ్మూర్తి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్ :** రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు, శ్రీకృష్ణ సేవా ట్రస్ట్ చైర్మన్, 18వ వార్డు కౌన్సిలర్, ప్రముఖ వైద్యులు డాక్టర్ వూర రామ్మూర్తి యాదవ్ జన్మదిన వేడుకలు జిల్లా కేంద్రంలోని ఆయన నివాసంలో గురువారం పలువురు నాయకులు, అభిమానులు కేక్ కట్ చేసి, బొకేలు అందజేసి ఘనంగా జన్మదిన వేడుకలను నిర్వహించారు. అనంతరం పుట్టిన రోజు సందర్భంగా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రోగులకు పండ్లను పంపిణీతోపాటు, కాసరబాద రోడ్డులోని అపూర్వ బధిరుల పాఠశాలలో విద్యార్థిని, విద్యార్థులకు అన్నదాన వితరణ చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ సుదీర్ఘకాలం పేదలకు వైద్యసేవలు అందిస్తూ ప్రజాసేవలో నిరంతరం సేవా దృక్పథంతో పనిచేస్తున్నారన్నారు. వైద్య వృత్తిలో పేదల పెన్నిధిగా ఎంత ఎదిగినా ఒదిగే ఉండటం ఆయన నైజం అని అభినందించారు. అందరూ నావాళ్లే అంటూ వైద్యరంగంలో, అటు రాజకీయ రంగంలో రాణిస్తూ భవిష్యత్తులో అన్ని వర్గాల గొంతుకై ఉన్నత పదవులు పొందాలని, మరెన్నో పుట్టినరోజులు జరుపుకొని ప్రజలకు నిరంతరం సేవలు అందించాలని కోరారు.వైద్య వృత్తిలో ప్రముఖ వైద్యులుగా రాణిస్తూ శ్రీకృష్ణ ట్రస్ట్ ద్వారా ప్రతిభ చూపిన విద్యార్థులకు, పేద ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత యాదవ మహాసభ జిల్లా అధ్యక్షులు మర్యాద పైదులు యాదవ్, లింగమంతుల దేవస్థానం చైర్మన్ పోలెబోయిన నర్సయ్య యాదవ్, కౌన్సిలర్ జ్యోతిశ్రీవిద్య కరుణాకర్, జిల్లా కాంగ్రెస్ నాయకులు యలగబోయిన మధు యాదవ్, నిమ్మల వెంకన్న, మాలోతు కమల్‌చంద్రు నాయక్, నాయకులు బోల్ల వెంకట్, కోడి లింగయ్య పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని పకడ్బందిగా నిర్వహించాలి

### తహసిల్దార్ మంగ

**ప్రజాపక్షం/నడిగూడెం :** భారత ఎన్నికల సంఘం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేయబడుతున్న సర్ ప్రక్రీయ తెలంగాణ రాష్ట్రంలో జూన్ 24 నుండి ప్రారంభమై జూలై 24 వరకు నిర్వహిస్తున్నట్లు తహసిల్దార్ మంగ తెలిపారు. గురువారం నడిగూడెం మండల వ్యాప్తంగా సర్ ప్రక్రీయ ప్రారంభమైనట్లు తెలిపారు. నడిగూడెం మండల కేంద్రంలో పోలింగ్ బూత్ 287 నందు ప్రత్యేక ఓటర్ జాబితా



ప్రక్రీయ సర్‌ను తహసిల్దార్ మ ంగ, సర్పంచ్ దున్న శ్రీనివాస్‌తో కలిసి సర్ ప్రక్రీయను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఒక వ్యక్తికి రెండు చోట్ల ఓటు లేకుండా చూడటం, మరణించిన వారి ఓట్లను తొలగించడమే సర్ ముఖ్య ఉద్దేశ్యమన్నారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి పొరపాట్లు, తప్పులు లేకుండా బిఎల్‌వోలు పకడ్బందింగా నిర్వహించాలని కోరారు. సర్ ఫామ్‌లో ఓటర్ ఉద్దేశ్యపూర్వకంగా తప్పుడు సమాచారం అందిస్తే జరిమాన, జైలు శిక్ష తప్పదని సూచించారు. విధి నిర్వహణలో బిఎల్‌వోలు ఎప్పటికప్పుడు సమాచారాన్ని యాప్‌లో పొందుపర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్‌ఐ గోపాలకృష్ణ, జిపివో కోటయ్య, వార్డు సభ్యులు శ్రీకాంత్, మామిడి రామకృష్ణ, బిఎల్‌వోలు పాల్గొన్నారు

# ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా ఇంటింటి సర్వే



**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి:** తెలంగాణ రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ జాబితా (సర్)ఇంటింటి సర్వే కార్యక్రమం గురువారం మున్సిపాలిటీలో మొదలైంది. శిక్షణ పూర్తి చేసుకున్న బిఎల్ ఓ లు ఇంటింటి సర్వే కార్యక్రమంలో పాల్గొని ఓటర్ల సమగ్ర సమాచార నమోదు చేపడుతున్నారు. అర్హులైన ఓటరు జాబితా నుండి తప్పించుకోకూడదని అనర్హులైన వారు ఓటర్ల జాబితాలో ఉండకూడదని ఈ సర్వే చేపడుతున్నారు. బిఎల్ వోలు ప్రతి ఇంటికి మూడు దఫాలుగా వస్తారు. మొదటి సారి ఫారంలు ఇచ్చి వెళ్లి పూర్తి చేసిన ఫారాలను మళ్ళీ తీసుకెళ్లి వాస్తవ పరిస్థితులను తెలుసుకుని ధ్రువీకరించుకుని ఓటర్ల తుది జాబితాను సవరించి ప్రత్యేక సమగ్ర జాబితా విడుదల చేస్తారు. ఇంటింటి సర్వేలో పాల్గొని బిఎల్‌ఓ లకు కుటుంబ సభ్యులు సరియైన వివరాలు అందజేసి సహకరించాలని కోరారు. ఈ ఇంటింటి సర్వే ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమం వచ్చే నెల 24 వరకు కొనసాగనుంది. మొదటి రోజు కార్యక్రమంలో అసిస్టెంట్ ఎలక్టోరల్ రిటర్నింగ్ ఆఫీసర్ శ్రీనివాస్ రెడ్డి డిప్యూటీ తాసిల్దారు నాగేశ్వరరావు రెవిన్యూ ఇన్స్పెక్టర్ సుధాకర్ రావు సత్యనారాయణ రెడ్డి సర్వేయర్ సాయి మండల రెవెన్యూ సిబ్బంది బి ఎల్ ఓ లు బూత్ లెవెల్ ఏజెంట్లు పాల్గొన్నారు.

# ఊకొండి గ్రామవాసి ఖమ్మం పాటి శ్యాంకు డాక్టరేట్ ప్రదానం



**ప్రజాపక్షం/ నల్లగొండ టౌన్ :** మహాత్మా గాంధీ విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగం అధ్యాపకురాలు డా ఆర్ రూ ప పర్యవేక్షణలో స్టడీస్ ఆన్ న్యూస్ స్టెబిలిటీ ఇండికేటింగ్ హెచ్పిఎల్సి మెథడ్స్ ఫర్ ద ఎస్టిమేషన్ ఆఫ్ సెలెక్టెడ్ ఎనలైట్స్ ఇన్ బల్క్ అండ్ ఫార్మాసిటికల్ ఫార్ములాస్ అనే అంశంపై పరిశోధన ఫలితంగా ఖమ్మం పాటి శ్యామ్ డాక్టరేట్ పట్టా అందుకున్నారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాల య ఉప కులపతి ఆచార్య ఖాజా అల్తాఫ్ హుస్సేన్ మాట్లాడుతూ ఈ పరిశోధనలో భాగంగా, ఎంపిక చేసిన ఔషధాలలో నాణ్యత, స్థిరత్వం భద్రతను నిర్ధారించేందుకు అవసరమైన ఆధునిక స్టెబిలిటీ సూచించే హెచ్పిఎల్సీ విశ్లేషణా పద్ధతులను అభివృద్ధి చేసి,శాస్త్రీయంగా ధృవీకరించారని తెలిపారుఈ సందర్భంగా హుస్సేన్ , రిజిస్ట్రార్ ఆచార్య కె. అంజి రెడ్డి , యూనివర్సిటీ కళాశాల ఆఫ్ సైన్సు ప్రిన్సిపాల్ ప్రొఫసర్ ఎం. వసంత , సైన్స్ ఫ్యాకల్టీ డీన్ ప్రొఫసర్ అన్నపూర్ణ ఆర్.ఎస్. బుట్టి , రసాయన శాస్త్ర విభాగాధిపతి డా. ఎం. జ్యోతి రసాయన శాస్త్ర విభాగ అధ్యాపకులు , శ్యామ్ కు పర్యవేక్షకురాలు డా. ఆర్. రూపకు అభినందనలు తెలియజేశారు.

## విశ్రాంత ఉపాధ్యాయులకు జన్మదిన శుభాకాంక్షలు

**ప్రజాపక్షం/నడిగూడెం:** ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో విశ్రాంత ఉద్యోగులు గురువారం మండల కేంద్రానికి చెందిన రిటైర్డ్ ఉపాధ్యాయులు, స్థానిక వీరాంజనేయ స్వామి దేవాలయ చైర్మన్ పందిరి వెంకటరెడ్డి నివాసానికి వెళ్లి జన్మదిన శుభాకాంక్షలు తెలిపి, కేక్ కట్ చేసి స్వీట్లు అందజేసి శాలువాలతో సన్మానించారు. అనంతరం వారిని నిండు నూరేళ్ల జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగులు గుండు అనంతరాములు, ఎండి ఖలీల్‌అహ్మద్, ఎల్. బాలాజీనాయక్, ఎండి ఇబ్రహీం, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## సర్ నమోదు ప్రక్రియ ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసగౌడ్



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** పట్టణంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (సర్) నమోదు ప్రక్రియను గురువారం మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాసగౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటర్ల జాబితా సవరణ కార్యక్రమంలో ప్రతి బూత్‌స్థాయి నాయకుడు, కార్యకర్త బాధ్యతయుతంగా పాల్గొని అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని సూచించారు. బలమైన ప్రజాస్వామ్య వ్యవస్థకు స్వచ్ఛమైన సమగ్ర ఓటర్ల జాబితానే పునాదని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని తమ ఓటర్ వివరాలను పరిశీలించి అవసరమైన మార్పులు చేర్పులు చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కల్లుగీత కార్మిక సంఘం చైర్మన్ పంల్ల హుస్సేన్, దొంతగాని జగన్, ఆసిఫ్ పాల్గొన్నారు.

## పల్స్ పోలియో శిక్షణ శిబిరం

**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** జూన్ 28న నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు లింగగిరి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలకు హుజూర్‌నగర్‌లోని ఎంపిడివో కార్యాలయంలో శిక్షణ శిబిరం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా మండల వైద్యాధికారి డాక్టర్ వేణుగోపాల్‌నాయక్ మాట్లాడుతూ పుట్టిన ప్రతి శిశువు నుండి ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని సూచించారు. పోలియో నిర్మూలనతో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని, ఒక్క చిన్నారి మిస్ కాకుండా ఇంటింటి సర్వే నిర్వహించి పోలియో చుక్కలు అందించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. శిక్షణలో పోలియో చుక్కల పంపిణీ విధానం, బూత్ నిర్వహణ, ఇంటింటి సందర్శనలు, సంచార కుటుంబాల గుర్తింపు, రిపోర్టుల నిర్వహణ, ప్రజల్లో అవగాహన కల్పించే అంశాలపై సిబ్బందికి వివరించారు. ఈ కార్యక్రమంలో కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ పద్మ, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్ పద్మ, రూట్ సూపర్‌వైజర్లు ఇందిరాల రామకృష్ణ, శ్రీనివాస్, ఆరోగ్య సిబ్బంది, ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇంటింటి సర్వేకు ప్రజలు సహకరించాలి



**ప్రజాపక్షం/పెన్‌పహాడ్ :** బూత్‌స్థాయి అధికారులు నిర్వహించే ఇంటింటి సర్వేకు గ్రామ ప్రజలందరూ సరైన వివరాలను అందించి పూర్తిస్థాయిలో సహకరించాలని గ్రామ సర్పంచ్ నాతాల వెంకటరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని గాజులమల్కాపురం గ్రామంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం అధికారికంగా ప్రారంభించి ఆయన మాట్లాడారు. పారదర్శకమైన ఓటర్ల జాబితా రూపకల్పనే లక్ష్యంగా ప్రభుత్వం ఈ ఎస్ఐఆర్ కార్యక్రమాన్ని చేపట్టిందని తెలిపారు. గ్రామంలో 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని కోరారు. చనిపోయిన వారి పేర్లు, నకిలీ ఓట్ల తొలగింపునకు సహకరించి ఓటరు జాబితా ప్రక్షాళనకు విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిపిఒ మధు, ఉపసర్పంచ్ సొంటి ఆంజనేయులు, మాజీ సర్పంచ్ బండి రామకృష్ణారెడ్డి, పంచాయితీ కార్యదర్శి లావణ్య, బూత్‌స్థాయి అధికారులు లక్ష్మి, వార్డు సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్‌కు శ్రీకారం



**ప్రజాపక్షం/యాదాద్రి కలెక్టరేట్:**యాదాద్రి భువనగిరి జిల్లాలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ABDM) కార్యక్రమానికి కలెక్టర్ అనురాగ్ జయంతి శ్రీకారం చుట్టారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో తెలంగాణ రాష్ట్రంలో ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ABDM) అమలులో మోడల్ డిస్ట్రిక్ట్‌గా ఎంపికైన నేపథ్యంలో జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అధ్యక్షతన జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించబడింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఆరోగ్య రంగాన్ని పూర్తిస్థాయిలో డిజిటలైజ్ చేయడం, ప్రతి పౌరుడి ఆరోగ్య సమాచారాన్ని ఒకే వేదికపై అందుబాటులో ఉంచడం ABDM ప్రధాన లక్ష్యమని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా హెల్త్ ఫెసిలిటీ రిజిస్ట్రీ (HFR) మరియు హెల్త్ ప్రొఫెషనల్ రిజిస్ట్రీ (HPR) నమోదులను వేగవంతం చేయాలని ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులు, క్లినిక్కు, డయాగ్నస్టిక్ సెంటర్లు, ల్యాబొరేటరీలు, ఫార్మసీలు మరియు వైద్య నిపుణులందరూ ఈ డిజిటల్ ప్లాట్ఫారమ్లో నమోదు కావాల్సి ఉంటుందని తెలిపారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ వైద్య సంస్థలు మరియు ఆరోగ్య సిబ్బంది తప్పనిసరిగా HFR, HPR నమోదులు పూర్తి చేయాలని సూచించారు. వైద్యులచే జారీ చేయబడే డిజిటల్ ప్రిస్క్రిప్షన్లు, ఆరోగ్య రికార్డుల డిజిటల్ నిర్వహణ ద్వారా ప్రజలకు మెరుగైన, పారదర్శకమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని వివరించారు. ABDM అమలును పర్యవేక్షించేందుకు జిల్లాలో ప్రత్యేక కమిటీలు, ఫీల్ బృందాలు ఏర్పాటు చేయబడినట్లు కలెక్టర్ తెలిపారు. వచ్చే రెండు వారాల్లో జిల్లాలోని అన్ని అర్హత కలిగిన ఆరోగ్య సంస్థలు, వైద్య నిపుణుల నమోదులు పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమం దేశంలోనే అతిపెద్ద డిజిటల్ ఆరోగ్య సంస్కరణల్లో ఒకటిగా నిలుస్తుందని, యాదాద్రి భువనగిరి జిల్లాను రాష్ట్రంలో ఆదర్శ జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి శాఖ సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ABDM ద్వారా పౌరుల ఆరోగ్య రికార్డులు సురక్షితంగా, సులభంగా అందుబాటులో ఉండే డిజిటల్ ఆరోగ్య వ్యవస్థ ఏర్పడుతుందని తెలిపారు. ఆయుష్మాన్ భారత్ డిజిటల్ మిషన్ (ABDM) కింద ప్రతి పౌరునికి ABHA ID రూపొందించడం ద్వారా వారి ఆరోగ్య రికార్డులను డిజిటల్ రూపంలో అనుసంధానం చేయవచ్చు. రోగి అనుమతితో దేశంలోని ఏ ప్రభుత్వ లేదా ప్రైవేటు ABర్యాMనమోదిత ఆసుపత్రిలోనైనా గత వైద్య చరిత్ర, పరీక్షా నివేదికలు, ప్రిస్క్రిప్షన్లు మరియు ఇతర ఆరోగ్య వివరాలను పరిశీలించి, వేగవంతమైన మరియు నాణ్యమైన వైద్య సేవలు అందించవచ్చు. దీంతో కాగితపు రికార్డుల అవసరం తగ్గి, అత్యవసర పరిస్థితుల్లో కూడా చికిత్స మరింత సమర్థవంతంగా అందుతుంది. రోగి అనుమతి లేకుండా ఆరోగ్య వివరాలను ఎవరూ చూడలేరు.గోప్యతకు పూర్తి రక్షణ ఉంటుంది. ఈ సమావేశంలో డాక్టర్ మనోహర్ జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి జెడ్.పి.సి.ఇ.ఓ. శోభరాణి ABDM నోడల్ అధికారి డాక్టర్ సుమన్ కళ్యాణ్, ABDM స్టేట్ ట్రైనర్ సాయి కుమార్, మున్సిపల్, పంచాయతీ రాజ్ శాఖల ప్రతినిధులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది ఒబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కార్యకర్త కుమార్తె పెళ్లికి ఎమ్మెల్యే రూ.50 వేల ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :**దంతూరు మాజీ ఉప సర్పంచ్ శ్రీనివాస్ ఇటీవల గుండెపోటుతో మృతి చెందగా వారి కుమార్తె యమున వివాహం గురువారం చౌటుప్పల్ మండలంలోని ధర్మోజి గూడెం జై కన్వెన్షన్ హాల్‌లో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి హాజరై రూ.50,000 ఆర్థిక సహాయాన్ని అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు పాక మల్లేష్ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు ఉప్పునూతల వెంకటేష్ యాదవ్, మండల నాయకులు మన్నె వెంకటరెడ్డి, సర్పంచ్ గోరుగంటి సువర్ణ రవీందర్, మాజీ సర్పంచ్ దోటి కుమార్ యాదవ్, మండల కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి బోదాస్ చిన్న ఈదయ, బోదాసు వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

## స్వరూప మృతికి కారణమైన వ్యక్తిని శిక్షించాలని ధర్నా

**ప్రజాపక్షం/ఆత్మకూర్ (యం) :**మండల కేంద్రం చెందిన శిగ లక్ష్మణ్ భార్య స్వరూప (38) మృతికి కారణమైన వ్యక్తిని కఠినంగా శిక్షించాలని మహిళా సంఘాలు, గౌడ సంఘ సభ్యులు, కుటుంబ సభ్యులు మండల కేంద్రంలోని ప్రధాన రహదారి మోత్కూరు భువనగిరి పై ధర్నా నిర్వహించారు. గురువారం పెద్ద ఎత్తున ఆందోళన, ధర్నా నిర్వహించారు. దీనితో కిలోమీటర్ల వరకు వాహనాలు నిలిచిపోయాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం ఈ నెల 19న గుండాల మండలంలోని అంబాల గ్రామంలో స్వరూప తన పిన్ని ఇంట్లో ఆత్మహత్యకు పాల్పడగా కుటుంబ సభ్యులు గమనించి, చికిత్స నిమిత్తం హైదరాబాదులోని గాంధీ హాస్పిటల్ కు తరలించగా చికిత్స పొందుతూ 22 నాడు మృతి చెందింది. స్వరూప ఆత్మహత్యకు గల కారణం మండల కేంద్రానికి చెందిన నాగం మల్లారెడ్డి కారణం అంటూ కుటుంబ సభ్యులు స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. మృతదేహాన్ని మల్లారెడ్డి ఇంటి ముందు వేసేందుకు మహిళా సంఘాల సభ్యులు, కుటుంబ సభ్యులు ప్రయత్నించగా పోలీసులు నిరాకరించడంతో గ్రామంలో ఉద్రిక్తతకు దారితీసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం నిర్వహించడం జరుగుతుంది. గ్రామంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఏసిపి మధుసూదన్ రెడ్డి, సిఐ వెంకటేశ్వర్లు, ఆత్మకూర్, గుండాల, అడ్డగూడూర్, మూటకొండూర్, మోత్కూర్ ఎస్సైలు ఆధ్వర్యంలో బందోబస్తు నిర్వహించారు.

## ఆర్యవైశ్య మహాసభ పట్టణ ఉపాధ్యక్షుడిగా కక్కిరేణి



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్:**సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య మహాసభ ఉపాధ్యక్షులుగా ప్రముఖ వ్యాపారవేత్త, సామాజిక సేవకుడు కక్కిరేణి ప్రసాద్ నియమితులయ్యారు. గురువారం స్థానిక శ్రీవాసవి కన్యకాపరమేశ్వరి దేవాలయ ప్రాంగణంలో జరిగిన కార్యక్రమంలో పట్టణ ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షుల చేతుల మీదుగా ఆయన నియామక పత్రాన్ని అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాపై నమ్మకం ఉంచి ఉపాధ్యక్ష పదవి బాధ్యతలు అప్పగించిన పట్టణ అధ్యక్షడికి, కార్యవర్గ సభ్యులకు, కుల పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవాసవి మాత ఆశీస్సులతో ఆర్యవైశ్య మహాసభ ఆశయ సాధనకు, కులబంధువుల సంక్షేమానికి నా వంతు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా విద్య, వైద్యం, పేద ఆర్యవైశ్య కుటుంబాలకు ఆర్థిక చేయూత, యువతకు స్వయం ఉపాధి రంగంలో ప్రోత్సాహం వంటి సేవా కార్యక్రమాలను మరింత విస్తృతం చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీవాసవి సేవా సమితి జిల్లా అధ్యక్షులు బచ్చు పురుషోత్తం, దేవరశెట్టి నాగరాజు, సోమ ప్రవీణ్ కుమార్, పలువురు ఆర్యవైశ్యులు పాల్గొన్నారు.

## సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ముందుండాలి



**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** సేవా కార్యక్రమాల్లో లయన్స్ క్లబ్ ఎల్లప్పుడూ ముందుండి సమాజానికి మరింత చేరువ కావాలని, పేద ప్రజల సంక్షేమమే ప్రధాన లక్ష్యంగా కార్యక్రమాలు నిర్వహించాలని బీసీ యువజన సంఘం రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ తిరుమలగిరి అశోక్ పేర్కొన్నారు. మిర్యాలగూడ లయన్స్ క్లబ్ నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన కూటాల రాంబాబుకు బీసీ యువజన సంఘం ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన సన్మాన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. లయన్స్ క్లబ్ గత మూడు దశాబ్దాలుగా సమాజ సేవలో విశిష్ట పాత్ర పోషిస్తూ ప్రజల మన్ననలు పొందుతోందని తెలిపారు. ప్రత్యేకించి పేద ప్రజల సంక్షేమం కోసం ఉచిత వైద్య శిబిరాలు, అన్నదాన కార్యక్రమాలు, విద్యా సహాయం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహిస్తూ సంస్థ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుందని చెప్పారు. సమాజంలో ఆర్థికంగా వెనుకబడిన వర్గాలకు అండగా నిలుస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్న లయన్స్ క్లబ్ కార్యక్రమాలు మరెందరికో ఆదర్శంగా నిలుస్తున్నాయని పేర్కొన్నారు. నూతన అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన కూటాల రాంబాబు ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలు మరింత విస్తరించాలని ఆకాంక్షించారు. విద్య, వైద్యం, సామాజిక సేవ రంగాల్లో మరిన్ని కార్యక్రమాలు చేపట్టి అవసరంలో ఉన్న ప్రజలకు చేయూత అందించాలని కోరారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతున్న నిరుపేదలకు సహకారం అందించే దిశగా ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీసీ యువజన సంఘం జిల్లా కో కన్వీనర్ సిద్ధం రాజు, పట్టణ నాయకుడు పట్టేటి రమేష్, నియోజకవర్గ నాయకుడు మునగాల శైలేందర్, నాయకులు లక్ష్మణ్, కోల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయ కక్షలతో వేధిస్తున్నారు

**ప్రజాపక్షం/ మిర్యాలగూడ:** రాజకీయంగా ఎదుగుతున్నాననే కక్షతో తనను, తన అనుచరులను కొంత మంది తీవ్రంగా వేధిస్తూ ప్రాణభయానికి గురిచేస్తున్నారని మిర్యాలగూడ శాంతినగర్‌కు చెందిన పొగిళ్ళ వెంకన్న ఆవేదన వ్యక్తం చేశారు. తన ప్రాణాలకు ముప్పు ఉందని, రక్షణ కల్పించాలంటూ ఆయన వన్‌టౌన్ సీఐకి గురువారం ఫిర్యాదు చేశారు. వెంకన్న తెలిపిన వివరాల ప్రకారం. తాను రాజకీయాల్లో ఉంటూ ప్రజల్లో మంచి పేరు సంపాదించుకుంటూ ముందుకు సాగుతుండటం గిట్టని మిట్టపల్లి వెంకటేష్, అతని అనుచరుడు మోజిద్‌లు గత కొంతకాలంగా తనపై కక్ష పెంచుకున్నారు. ఈ క్రమంలోనే పలుమార్లు తనను నేరుగా, ఫోన్ ద్వారా సంప్రదించి తీవ్ర పదజాలంతో దూషిస్తూ, చంపేస్తామని బెదిరింపులకు పాల్పడ్డారు.

## నూతన సిఐ సతీష్ రెడ్డికి ఎస్ఐ భాస్కర్ అభినందనలు

**ప్రజాపక్షం/భూదాన్ పోచంపల్లి :**చౌటుప్పల్ నూతన రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్‌గాడి.సతీష్ రెడ్డి గురువారం బాధ్యతలు స్వీకరించారు. నల్లగొండ జిల్లా హాలియా పోలీస్ స్టేషన్ నుండి బదిలీపై పోచంపల్లి ప్రాంత సిఐగా విధుల్లో చేరారు. ఈ సందర్భంగా పోచంపల్లి ఎస్హ్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ కె భాస్కర్ రెడ్డి ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను కానుకగా ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. శాంతి భద్రతల అంశాల పట్ల ఇరువురు చర్చించారు. ఈ మేరకు పోచంపల్లి పోలీస్ స్టేషన్ సిబ్బంది శుభాకాంక్షలు తెలిపారు.

## ఉప్పలపహడ్‌లో సీసీ రోడ్డు పనులు ప్రారంభం

**ప్రజాపక్షం/ఆత్మకూర్(ఎం):**యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూర్(ఎం) ఉప్పలపహాడ్ గ్రామంలో ఆలేరు అభివృద్ధి ప్రదాత ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య సహాయ సహకారాలతో గురువారం ఉదయం 9 గంటలకు సిసి రోడ్డు పనులు సర్పంచ్ చిన్నం బీరప్ప ఆధ్వర్యంలో పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఐలన్న సహకారంతో గ్రామంలో ఎక్కడ కూడా మట్టి రోడ్డు లేకుండా సిసి రోడ్లు వేస్తానని చెప్పారు. దానికి గ్రామ ప్రజలు ఐలన్నకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మర్యాద స్వరాజ్యలక్ష్మి, వార్డు సభ్యులు గంధమాల అయోధ్య, చిన్నం శ్రీనివాస్, రాంపక నరసయ్య, తీగల స్వప్న, లోడే సునీత, గ్రామపంచాయతీ కార్యదర్శి నిడిగొండ శ్రీనివాస్, మండల పార్టీ ఉపాధ్యక్షులు మాజీ ఎంపిటిసి మరియాల వెంకటేశ్వర్లు గుప్త, కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి తీగల అశోక్, కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కన్వీనర్ లోడే శ్రీకాంత్, మాజీ వార్డు సభ్యులు తీగల బిక్షం, లోడి రేణుక, కారోబార్ కడకంచి ఆంజనేయులు, జెట్టి యాదయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ఆదర్శంగా నిలిచిన బాచుప్పల సర్పంచ్

**ప్రజాపక్షం/రామన్నపేట :**రామన్నపేట మండలం బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో 3 ఉన్న అడ్మిషన్స్ గ్రామ సర్పంచ్ చొరవతో 18కి పెరిగింది. ఆ ఊరి సర్పంచ్ బాచుప్పల మాధవి భూపాల్ ప్రైవేట్ పాఠశాలలో చదువుతున్న తన 2వ తరగతి అమ్మాయి ఉద్విత ను తమ ఊరి ప్రాథమిక పాఠశాలలో చేర్పించడమే కాకుండా పేరెంట్స్‌తో కలిసి తమ పాఠశాలను కాపాడుకోవాలనే ఉద్దేశంతో తల్లిదండ్రులందరిచే తీర్మానం చేయించి గ్రామంలోని 15 మంది విద్యార్థులను చేర్పించి అందరికి ఆదర్శంగా నిలిచారు. వార్డు మెంబర్లు,మాజీ వార్డు మెంబర్లు కూడా తమ పిల్లలను చేర్పించారు. ఇప్పుడు బాచుప్పల ప్రాథమిక పాఠశాలలో విద్యార్థుల సంఖ్య 18కి చేరింది. ఇదే విధంగా ప్రతీ ఊరి ప్రజలు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల లో చేర్పించి ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించు కోవాలని సర్పంచ్ మాధవీ భూపాల్ కోరారు. ఈ సందర్భంగా గురువారం పాఠశాలలో సామూహిక అక్షరాభ్యాసం నిర్వహించారు. విద్యార్థులందరికీ పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఓర్సు వెంకటయ్య నోటుబుక్స్ ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ సందేనబోయిన మహేశ్వరి రవి, ఉపాధ్యాయులు శిరీష, అంగన్వాడి టీచర్ నాగమణి తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వడాయిగూడెం గ్రామంలో పోచమ్మ అమ్మవారి కళ్యాణం..

**ప్రజాపక్షం/భువనగిరి రూరల్ :**భువనగిరిలోని మండలంలోని వడాయిగూడెం గ్రామంలో గురువారం యాదవ కులస్తుల ఆరాధ్య దైవం శ్రీ బుగ్గ పోచమ్మ అమ్మవారి కళ్యాణ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భువనగిరి మాజీ శాసనసభ్యులు పైళ్ళ శేఖర్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు క్యామ మల్లేష్ యాదవ్, అలాగే బిజెపి రాష్ట్ర ఉపాధ్యక్షులు భువనగిరి మాజీ పార్లమెంట్ సభ్యులు బూర నర్సయ్య గౌడ్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వడాయిగూడెం గ్రామ సర్పంచ్ నీల శిరీష ఓం ప్రకాష్ గౌడ్, ఉప సర్పంచ్ చుక్కల శంకర్ యాదవ్, వార్డు సభ్యులు బబ్బూరి సబితా, పబ్బల ఉమ రమేష్, చుక్కల దుర్గయ్య, కోట దీప జహంగీర్, కోట సుధాకర్, కోట సుదావాణి, మల్లిఖార్జున, బబ్బురి భరత్ గౌడ్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి నీల ఓంప్రకాష్ గౌడ్, గ్రామ పంచాయతీ సెక్రెటరీ కే.ఆమని, ఫీల్డ్ అసిస్టెంట్ల సంఘం జిల్లా అధ్యక్షులు బబ్బురి శంకర్ గౌడ్, యాదవ కులస్తులు గ్రామస్తులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.